సాక్షి పెద్దపల్లి

గురువారం । 27 । జూలై । 2023



సింగరేణి క్వార్టర్లలోకి డ్రైనేజీ నీరు

గోదావరిఖని: భారీ వర్షాలకు ఆర్జీ–1 ఏరియాల్లోని లోతట్టు ప్రాంతాల క్వార్టర్లలోకి డ్రైనేజీ నీరు చేరింది. కార్మికులు ఆందోళనకు గురయ్యారు.



రాకపోకలు బంద్

గోదావరిఖని:జీడికే–2ఏ మోరిపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిపివేశారు. మోరీ వద్ద గోదావరిఖని వన్ టౌన్ సీఐ ప్రమోద్ కుమార్ సెక్యూరిటీ ఏర్పాటు చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని చాలా పాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన అరుణశ్రీ



బాధ్యతలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: జిల్లా స్థానికసంస్థల అడిషనల్ కలెక్టర్‌గా అరుణశ్రీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా పనిచేసిన అరుణశ్రీ పెద్దపల్లికి బదిలీ కాగా విధుల్లో చేరారు. అనంతరం ఆమె కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె వెంట కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్ ఉన్నారు. అడిషనల్ కలెక్టర్‌ను ఎంపీడీఓలు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల తనిఖీ



వసతులపై ఆరా తీస్తున్న శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లోని ప్రభుత్వ కార్యాలయాలను బుధవారం అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ తనిఖీ చేశారు. వసతులపై అధికారులు, సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. సమయపాలన పాటించి, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. ఆయన వెంట కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్ ఉన్నారు.

ఎల్లంపల్లికి భారీగా వరద



గేట్లు ఎత్తి దిగువకు వరద నీటి విడుదల

రామగుండం: భారీ వర్షాలకు ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 53,109 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 11 గేట్లు ఎత్తి 81,137 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.

ఇంటిముఖం పట్టిన విద్యార్థులు



సుల్తానాబాద్ హాస్టల్ నుంచి వెళ్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించిన విషయం తెల్సిందే. వాతావరణ శాఖ జిల్లాకు రెడ్‌అలర్ట్ ప్రకటించడంతో హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు వారివారి స్వగ్రామాలకు తరలివెళ్తున్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ హాస్టల్ ఉంటున్న మంచిర్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాల విద్యార్థులు వర్షంలో తడుస్తూ ఇంటిముఖం పట్టారు.

వరద బాధితులకు అండగా ఉంటాం



బాధితులను పరామర్శిస్తున్న రాజ్‌ఠాకూర్

జ్యోతినగర్: భారీవర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమై.. ఇళ్లలోకి నీరు చేరిన బాధితులకు అండగా ఉంటామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.లక్ష చొప్పు పరిహారం అందించాలనిడిమాండ్ చేశారు. 23వ డివిజన్‌లోని మోమీన్‌నగర్‌లో పర్యటించి ప్రజలకు ధైర్యం చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే అధికారులను అప్రమత్తం చేయాల్సిందిపోయి పట్టించుకోవడం లేదన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శిగా శ్రీనివాస్

జ్యోతినగర్: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా కొమురోజు శ్రీనివాస్‌ను నియమిస్తూ డీఈవో మాధవి ఉత్తర్వులు అందించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న శ్రీనివాస్‌ను 2023–25కుగాను నియమించారు. తన నియామకానికి సహకరించిన డీఈవో, పలువురికి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

జల దిగ్బంధం

- గోదావరిఖనిలో పొంగిపొర్లుతున్న నాలాలు
- రోడ్లు, ఇళ్లల్లోకి మురుగునీరు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- వర్షం ఇలాగే ఉంటే ప్రమాదమే..
- పర్యాటక ప్రాంతాల వద్ద మొక్కుబడి భద్రత



అలుగుదూకుతున్న సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి చెరువు



మెడికల్ కాలేజీలోకి చేరిన వరదనీరు



పెద్దపల్లిలో నీట మునిగిన వరి పొలాలు



జిల్లాకేంద్రంలో కురుస్తున్న భారీ వర్షం



కార్పొరేషన్‌లో నీట మునిగిన సప్తగిరికాలనీ

ఇలా చేయాలి..

- ఏటా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా శాశ్వత పరిష్కారం దిశగా బల్దియా అధికారులు చర్యలు తీసుకోవటం లేదు.
- తాత్కాలికంగానైనా కాల్వల్లో పూడిక తీయించాలి.
- డ్రైనేజీ, మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయాలి.
- ఆక్రమణలను తొలగించి వరదనీరు సాఫీగా ప్రవహించేలా చూడాలి.
- వరదను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టలేదనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.
- గతేడాది గోదావరి బ్యాక్‌వాటర్, నాలాలు ఉప్పొంగడంతో ఈ కాలనీల్లో ఇళ్లు వరదనీటిలో మునిగిపోయాయి.
- గోదారి వెంబడి సుమారు 5కిలోమీటర్ల మేర కరకట్టలు నిర్మించాల్సి ఉండగా అవి ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి.
- శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టుల్లో వరద ఉధృతి పెరిగి, వర్షం ఇదే జోరుతో కురిస్తే నాలాల వెంబడి ఉన్న కాలనీల్లోని ఇళ్లలోకి వరదనీరు చేరే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బుధవారం కురిసిన వర్షాపాతం వివరాలు (మి.మీలో)	
రామగుండం	84.5
మల్యాలపల్లి	72.8
అకేనేపల్లి	59.8
కమాన్‌పూర్	58.3
భోజన్నపేట	49.0
కూనారం	47.3
శ్రీరాంపూర్	44.3
ముత్తారం	43.0
రంగంపల్లి	40.0
ఓదెల	39.8

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో చినుకు ఆగలేదు.. వాన తగ్గలేదు. గోదావరి, మానేరు, హుస్సేనిమియా వాగుల్లోకి వరదనీరు పోటెత్తుతోంది. వారంరోజులుగా దంచికొడుతున్న వర్షాలతో జనం ఆగమాగం అవుతున్నారు. ప్రజలు రోజువారీ పనులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. జూన్ మొత్తం వానలు లేకపోవడంతో అన్ని మండలాల్లో లోటు వర్షపాతమే కనిపించింది. ఇప్పుడు లోటు అన్నదే లేకుండా పోయింది. జిల్లాలోని అన్ని మండలాల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. వారం రోజుల్లోనే జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో భారీ వర్షం కురవడంతో చెరువులు, కుంటలు, వాగులు, ఒర్రెలు వరదనీటితో కళకళలాడుతున్నాయి.

పొంగుతున్న నలాలు

రామగుండం కార్పొరేషన్ పరిధిలోని మేజర్ నాలాల్లో ఈ యేడాది పూడికతీత తీయలేదు. ఫలితంగా సిల్ట్ నిండి వరద ప్రవాహానికి అడ్డుగా మారింది. బుధవారం ఉదయం నుంచి కుండపోతగా కురుస్తున్న వర్షంతో నాలాలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఇందిరానగర్, దుర్గానగర్, మారుతికాలనీ, మెడికల్‌కాలేజీ, సప్తగిరి కాలనీల నుంచి గోదావరిలో కలిసే నాలా పొంగుతుండటంతో ఆయా కాలనీల్లోని రోడ్లు, ఇళ్ల మధ్య మురుగునీరు చేరుతోంది. ఐబీకాలనీ, క్రిస్టియన్ శ్మశాన వాటిక, ఆర్టీసీ బస్‌డిపో వెనుక నుంచి మేజర్ నాలాలో కలిసి ఈ నాలా ఉధృత రూపం దాల్చుతోంది. ప్రధాన రహదారి మీదకు వరదనీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఫైవింక్లేవ్, 2ఏ మోరీ పూడికతీత తీయకపోవడంతో సీతనగర్, మల్లికార్జున్‌నగర్ తదితర కాలనీల్లో వరదనీరుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పర్యాటక ప్రాంతాల పై పట్టింపేది

జిల్లాలో ఏటా వర్షాకాలంలో సబ్బితం వద్దగల గౌరీగుండాల జలపాతం, రామునిగుండాలు, పాండవుల జలపాతాలు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. భారీవర్షాలు కురిసిన సందర్భాల్లో వరదనీరు పెరగటంతో ప్రమాదాలకు నెలువుగా మారుతున్నాయి. సబ్బితం జలపాతం వద్ద ఇప్పటివరకు సుమారు 15మందికి పైగా మృత్యువాత పడ్డారు. పోలీసులు భారీవర్షాలు కురిసినప్పుడు జలపాతాలకు ప్రవేశాలు నిషేధం విధిస్తున్నా.. అవి మొక్కుబడిగా మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా జలపాతాలను సందర్శించే వారు మృత్యువాత పడుతున్నారు.

బల్దియాకు ముంపు భయం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలోని పలు కాలనీవాసులు వరద ముంపు భయంతో వణుకుతున్నారు. బల్దియాలో సుమారు 319.9 కిలోమీటర్ల మేర మురుగు కాల్వలు ఉండగా.. ఇందులో ఎనిమిది మేజర్ నాలాలు ఉన్నాయి. వేసవిలోనే నాలాల్లో పూడిక తీయాలి. ఏప్రిల్‌లో పిలవాల్సిన టెండర్లను మేనెలలో రూ.30లక్షలతో పిలిచారు. ఇప్పటివరకు ఒక్క నాలాను కూడా అధికారులు శుభ్రం చేయించలేదు. ఫలితంగా ప్రధాన నాలాలు నిండి రోడ్లపై వరద నీరు ప్రవహిస్తోంది. ఇందిరానగర్, మార్కండేయకాలనీ, సంజయ్‌గాంధీనగర్, కూరగాయల మార్కెట్ ఏరియా, ఉల్లిగడ్డల బజార్, మల్లికార్జున్‌నగర్, ఐబీకాలనీ, మెడికల్ కాలేజీ, ఎన్టీపీసీ, అన్నపూర్ణ కాలనీ, మేడిపెల్లి రోడ్డు, రామగుండం, గంగానగర్, 2ఏ మోరీ, ఫైవింక్లయిన్ చౌరస్తా ప్రాంతాల్లోని ప్రధాన నాలాలు పొంగిపొర్లుతున్నాయి.

గోదావరిఖనిని చుట్టుముట్టిన వరద

రామగుండంలో బుధవారం అత్యధికంగా 84.5 మి.మీ వర్షపాతం కురిసింది. సాయంత్రం ఉన్నట్టుండి వర్షం మొదలై కుండపోత కురిసింది. దీంతో ఎన్టీపీసీ ఏరియాతోపాటు పలు కాలనీలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. రోడ్లపైనే మోకాలు లోతుల్లోకి వరద నీరు చేరింది. అప్రమత్తమైన యంత్రాంగం వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉండడంతో ఆయా కాలనీవాసులను పునరావాస కేంద్రాల్లోకి తరలిస్తోంది. కొంతమందిని అంబేద్కర్ కమ్యూనిటీ సెంటర్‌లోకి.. ఇంకొందరిని దేవీగార్డెన్‌లోని పునరావాసానికి తరలించారు.

జీజీహెచ్‌లో అభివృద్ధి పనులకు అంచనాలు



సీసీ రోడ్డుకు అంచనాలు రూపొందిస్తున్న డీఈ

కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో అవసరమైన అభివృద్ధి పనులకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాలతో టీఎస్‌ఎంఐడీసీ అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం జీజీహెచ్‌ను టీఎస్‌ఎంఐడీసీ డీఈ రాజిరెడ్డి పరిశీలించారు. కొత్త బ్లాక్, బ్లడ్ సెంటర్‌వరకు బురదగా ఉండడంతో సీసీ రోడ్డు నిర్మాణానికి కొలతలు సేకరించారు. కొత్త బ్లాక్‌లో ఆక్సిజన్ సరఫరాకు అవసరమైన పైపుల ఏర్పాటు, 125 కేవీ సామర్థ్యం కలిగిన ఆర్‌ఓ ప్లాంట్, 15 టాయిలెట్ల నిర్మాణాలపై వివరాలు నమోదు చేసుకున్నారు. టీఎస్‌ఎంఐడీసీ ఏఈ అనిల్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సౌరవిద్యుత్ యూనిట్లకు స్త్రీనిధి రుణాలు



సుల్తాన్‌పూర్‌లో సౌరవిద్యుత్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎలిగేడు: సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు ముందుకొచ్చే స్వశక్తిసంఘాల సభ్యులకు స్త్రీనిధి ద్వారా రుణాలు అందిస్తామని స్త్రీనిధి రీజినల్ మేనేజర్ రాంనారాయణ తెలిపారు. మండలంలోని సుల్తాన్‌పూర్‌లో టీఎస్ రెడ్‌కో, స్త్రీనిధి ఆధ్వర్యంలో గ్రామస్తులకు సౌర విద్యుత్ విద్యుత్ ఏర్పాటుపై అవగాహన కల్పించారు. సబ్సిడీ మినహాయించి రుణాలు మంజూరు చేస్తామని, అర్హులు వినియోగించుకుని విద్యుత్ బల్లుల భారం తగ్గించుకోవాలని సూచించారు. సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, రెడ్‌కో డీఎం పరమాచారి, స్త్రీనిధి మేనేజర్ ప్రభాకర్, అసిస్టెంట్ మేనేజర్ బి.రాకేశ్‌కుమార్, ఏపీఎం సుధాకర్, సీసీలు, వీవోఏలు, స్వశక్తి సంఘాల మహిళలు, పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జీఎంలు

గోదావరిఖని: కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ–2 జీఎం మనోహర్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పూల మొక్కలు అందజేసి అభినందనలు తెలిపారు.

భారీ వర్షాలకు ఇళ్లలోకి వరద

- ఆందోళన చెందుతున్న లోతట్టు ప్రాంతాల ప్రజలు



ఇళ్లలోకి ప్రవహిస్తున్న వరదనీరు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో బుధవారం కురిసిన భారీ వర్షానికి మేజర్ నాలాల సమీపంలోని లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా మేజర్ నాలాలు భారీగా వరద నీటితో పొంగిపొర్లాయి. విఠల్‌నగర్, తిలక్‌నగర్, సప్తగిరికాలనీ తదితర ప్రాంతాల్లోని నాలాల నుంచి భారీగా వచ్చిన వరద నీరు సమీపంలోని ఇళ్లలోకి ప్రవహించింది. దీంతో బాధిత కుటుంబాలు ఆందోళనలకు గురయ్యాయి. ఇదే తరహాలో గురువారం కూడా వర్షం కురిస్తే లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయ్యే ప్రమాదం ఉందని తెలుస్తోంది. ఆయా డివిజన్ల కార్పొరేటర్లు బాధిత కుటుంబాలకు ధైర్యం చెబుతున్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ఆయిల్‌పాం సాగు లక్ష్యాలను అధిగమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో వివిధ శాఖల అధికారులు

- అంతరపంటలపై అవగాహన పెంచాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఆయిల్‌పాం సాగు లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో బుధవారం వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ఆదిరెడ్డి, జగన్మోహన్‌రెడ్డితో సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు. ఆయిల్‌పాం సాగుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీ, ఆ తర్వాత వచ్చే ఆదాయంపై అవగాహన కల్పించాలన్నారు. అంతరపంటలను సాగుచేసి అదనపు ఆదాయం పెంచుకునేలా సూచనలివ్వాలన్నారు. ప్రతి క్లస్టర్ పరిధిలో 15రోజుల్లో కనీసం 10ఎకరాల్లో ఆయిల్ పాం సాగు కావాలన్నారు. అలాగే రైతువేదికల్లో అన్ని వసతులను కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం రైతువేదికల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఉద్యానవన అధికారి జ్యోతి, ఏడీఏ శ్రీనాథ్, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



ఆకాశం మేఘావృతమై కొండలను తాకుతూ ప్రకృతిని మరింత అందంగా చేశాయి. ఆ సుందర దృశ్యాలు చూపరులను కనువిందు చేశాయి. పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ సమీపంలోని కొండలను ఆవరించిన మేఘాలు 'సాక్షి' కెమెరాకు కనిపించాయి.– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

సర్వేల జోరు.. 'సోషల్' హోరు!

- పార్టీలవారీగా నేతలు, అభిమానుల సర్వేలు
- సీఎం, ఎమ్మెల్సీ కవితను పోటీకి నిలిపిన సోషల్ మీడియా
- పొన్నం ప్రభాకర్ పార్టీ మారతారని ప్రచారం
- 'బండి' నిష్క్రమణ, కాంగ్రెస్ కరెంటువార్‌తో రీసర్వేలు
- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బహిరంగ అభిప్రాయ సేకరణ



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. ఎమ్మెల్యేలు, ఆశావహుల సర్వేలు జోరందుకున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల లీడర్లు ఎవరికి వారుగా ఓటరు అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. ముఖ్యంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై కార్యకర్తలు, ద్వితీయశ్రేణి నాయకులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో గత అసెంబ్లీ ఎన్నికల్లో 13 అసెంబ్లీ స్థానాలకు గాను 10 టీఆర్ఎస్ గెలుచుకోగా మిగిలిన మూడింటిలో ఏఐఎఫ్‌బీ, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు గెలిచారు. వీరిలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు తమకు అందుబాటులో ఉన్న వివిధ శాఖల అధికారుల ద్వారా ప్రజల మూడ్ తెలుసుకునేందుకు యత్నిస్తున్నారు. మరికొందరు ప్రైవేటు ఏజెన్సీల ద్వారా తెలుసుకుంటున్నారు. పాతజిల్లాలో కొన్ని సోషల్‌మీడియా పేజీలు, హ్యాండిళ్లు వచ్చే ఎన్నికల్లో ఎవరికి ఓటేస్తారు? అంటూ బహిరంగంగా ఫొటోలు పెట్టి మరీ అభిప్రాయం తెలుసుకోవడం విశేషం.

కరీంనగర్‌లో ఇద్దరు..

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పదవి నుంచి తప్పుకున్నాక, ఉచిత విద్యుత్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ చేసిన వ్యాఖ్యల తర్వాత స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కమలాకర్ గంగుల సర్వే చేయించారు. అత్యంత గోప్యంగా నిర్వహించిన ఈ సర్వేతో బీఆర్ఎస్ గ్రాఫ్, 2018 ఎన్నికల కంటే 16 శాతం పెరిగిందని మంత్రి ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇప్పటి వరకు కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి ఎవరన్నది తేలకపోవడం తమకు అనుకూలిస్తుందని బీఆర్ఎస్ వర్గాలు ధీమాగా ఉన్నాయి.

- మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బహిరంగ సర్వే ప్రారంభించారు. ప్రతీ గ్రామంలోని 100 మంది ఓటర్లను కలిసే బాధ్యతలను బీఆర్ఎస్ కార్యకర్తకు అప్పగించారు. వీరంతా పార్టీ మండలాధ్యక్షుడికి, మండలాధ్యక్షులంతా ఎమ్మెల్యేతో టచ్‌లో ఉంటారు. ప్రతీ కుటుంబంలో ఎన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఏదైనా పథకం అందలేదా? ఈసారి ఎన్నికల్లో ఎవరికి ఓటేస్తారు? కులం, వృత్తి, ఫోన్‌నెంబర్లు అడిగి నోట్ చేసుకుంటున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా తాజా ఓటర్లకు సమానమైన పేపర్లు ముద్రించి తీసుకురావడం గమనార్హం. క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలు, కార్యకర్తల స్థితిగతులను తెలుసుకునేందుకు వివరాల సేకరణ చేపట్టినట్లు ఎమ్మెల్యే రసమయి వెల్లడించారు.
- కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఏకంగా పార్టీ మారుతున్నారని, ఆయన హుస్నాబాద్ లేదా హుజూరాబాద్ నుంచి పోటీచేస్తారని కొన్నిరోజులుగా సోషల్ మీడియా ప్రచారం హోరెత్తింది. దీనిపై స్పందించిన పొన్నం ప్రభాకర్ తాను పార్టీ మారడం లేదని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. కొందరు కావాలని తనపై కుట్ర పూర్తితంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వదంతులను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు.
- పెద్దపల్లిలో ఉన్నవే మూడు అసెంబ్లీ స్థానాలు. అందులో రామగుండం నుంచి ఎమ్మెల్సీ కవిత, పెద్దపల్లి నుంచి ఏకంగా సీఎం కేసీఆర్ పోటీ చేస్తారని ప్రచారం ప్రారంభించారు. అంతేకాదు వీరిద్దరూ ఆయా స్థానాల నుంచి బరిలోకి ఎందుకు దిగుతారో కూడా కారణాలు వివరిస్తుండటం విశేషం. పార్టీ కార్యక్రమాల్లో సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత పెద్దపల్లి జిల్లా నేతలతో తీసుకున్న ఫొటోలను వీటికి జతచేస్తున్నారు. తద్వారా ఆయా ఎమ్మెల్యే వర్గాల్లో కలవరపాటుకు కారణమవుతోంది.
- సిరిసిల్లలో నేతల మధ్య ఎలాంటి వార్ లేదు. వేములవాడలో మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్, అదే పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్న చలిమెడ లక్ష్మీనరసింహారావు ఎవరికివారు సర్వేలు చేయించుకుంటున్నారు. ఈ రెండు గ్రూపుల మధ్య సోషల్‌వార్ వాడీవేడిగా నడుస్తోంది. జగిత్యాలలో ఎమ్మెల్యేల రహస్య సర్వే కొనసాగుతుండగా.. జిల్లాలో సోషల్ మీడియా వార్ అంతగా కనిపించడంలేదు.

నేతలకు 'సోషల్' బెంగ..

ఉమ్మడి జిల్లాలో సోషల్ మీడియా ప్రచారం ఎమ్మెల్యే అభ్యర్థులను కలవరపరుస్తోంది. ఫలానా స్థానం నుంచి ఫలానా సీనియర్ నేత పోటీ చేస్తారని ఊదరగొడుతున్నారు. ఇంకొందరు నేతల వీరాభిమానులు మీ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎవరు? అంటూ ఫ్యాన్ మేడ్ సర్వేల పేరిట ప్రధాన ప్రత్యర్థులు, ఎమ్మెల్యే ఆశావహుల ఫొటోలు పెట్టి ఓటింగ్‌కు వెళ్తున్నారు. ఇది అన్ని పార్టీల అభ్యర్థులకు ఇబ్బందికరంగా మారింది.

యాష్‌పాండ్ డ్రైయిన్‌కు మరమ్మతు

జ్యోతినగర్: జెన్‌కో యాష్ పాండ్ డ్రైయిన్‌కు మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టినట్లు సంస్థ సూపరింటెండెంట్ పులిశెట్టి విజేందర్ తెలిపారు. జెన్‌కో బూడిద చెరువు కట్ట తెగి వరద నీరు సమీప కాలనీల్లోని ఇళ్లలోకి చేరడంతో ప్రజలు భయపడ్డారని, అయితే చెరువు కట్టకు ఇబ్బంది లేదని, ఎగువ ప్రాంతంలోని గుట్టల నుంచి నీరు బూడిద చెరువులోకి చేరుతోందని, దీంతో డ్రైనేజీ గ్యాలరీకి గండి పడి దిగువన ఉన్న డ్రైయిన్స్‌లోకి వచ్చాయని పేర్కొన్నారు. జెన్‌కో అధికారులు స్పందించి మట్టికట్ట కట్టి, నీటిని మళ్లించారని పేర్కొన్నారు. సిబ్బంది తరుచూ కట్టప్రాంతాన్ని పర్యవేక్షిస్తుంటారని, ప్రజలు భయాందోళనకు గురికావద్దని తెలిపారు.



పనులు చేస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

టాస్క్‌ఫోర్స్ సీఐగా లింగయ్య

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో వెయిటింగ్‌లో ఉన్న ఎంఎల్ఎం లింగయ్యను టాస్క్‌ఫోర్స్ సీఐగా బదిలీ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ టాస్క్‌ఫోర్స్ సీఐగా ఉన్న ఆకుల అశోక్‌ను సీసీఆర్‌బీ సీఐగా బదిలీ చేశారు. కరీంనగర్ పీటీసీలో వెయిటింగ్‌లో ఉన్న జి.మొగిలిని సీఎస్‌బీ-2కు బదిలీ చేశారు.

నేడు గురుకులాల్లో ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు

రామగుండం: జిల్లాలోని మల్లాపూర్, గర్రెపల్లి, నందిమేడారంలోగల సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఐదు జూనియర్ లెక్చరర్లు, ఒక పీఈటీ పోస్టును పార్ట్‌టైం ఉద్యోగులతో భర్తీ చేసేందుకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి ఎం.మంజుల తెలిపారు. జూనియర్ లెక్చరర్ల పోస్టుకు పీజీ, బీఈడీ, పీఈటీ పోస్టుకు బీపీఈడీ అర్హత ఆసక్తి ఉన్నవారు ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 27న ఉదయం పది గంటలకు రామగుండంలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

లాభాల వాటా, ఏరియర్స్ చెల్లించాలి


వినతిపత్రం ఇస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: 11వ వేతన ఒప్పందం ప్రకారం సింగరేణి కార్మికులకు లాభాల వాటాతోపాటు 23 నెలల ఏరియర్స్‌ను యాజమాన్యం వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న, ఉపాధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్జీ-2 ఎస్‌వోటూ జీఎం సలీంకు వినతిపత్రం అందజేశారు. ఈ ఆర్థిక సంవత్సరం బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగి, సింగరేణి చరిత్రలోనే అత్యధిక టర్నోవర్ రికార్డు సాధించిందన్నారు. కార్మికుల వాటాగా రూ.700 కోట్లను దసరాలోపు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు రాయమల్లు, మల్లేశ్, తిరుపతి, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు

గోదావరిఖని: భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతేనే బయటకు రావాలని సీపీ రెమా రాజేశ్వరి సూచించారు. ఆపద సమయంలో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీసు యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఆపదలో ఉన్నవారు డయల్ 100కి ఫోన్‌చేయాలని సూచించారు. రాగల 48 గంటల్లో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రాజెక్టులు, పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేశామన్నారు.

గోరింటాకు పోటీలు



గోదావరిఖని: స్థానిక సింగరేణి ఇల్లెందు లేడీస్ క్లబ్‌లో బుధవారం గోరింటాకు పోటీలు నిర్వహించారు. ఆర్జీ-1 సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతిప్రజ్వలన చేసి, ప్రారంభించారు. కార్యక్రమంలో జీఎంల సతీమణులు జయ, పద్మ, క్లబ్ కార్యదర్శి బీనాసింగ్, నీరజ, స్వరూ, రజిత, రజిని, శ్రీలత పాల్గొన్నారు.

తోబుట్టువులే కాలయములు

- అన్నపై పెట్రోల్ పోసి, నిప్పంటించిన వైనం
- ధర్మారం మండలం కొత్తూరు గ్రామంలో ఘాతుకం
- ఘటనాస్థలిలోనే బాధితుడి మృతి
- ఇచ్చిన డబ్బులడగడం, వివాహేతర సంబంధానికి అడ్డురావడమే కారణం


వివరాలు సేకరిస్తున్న ఏసీపీ మహేశ్, సీఐ అనిల్, ఎస్సై సత్యనారాయణ


అశోక్ (ఫైల్)

ధర్మారం: డబ్బుపై ఆశ.. వివాహేతర సంబంధం కారణంగా వారికి రక్త బంధం గుర్తురాలేదు.. తోబుట్టువులే కాలయములై ఇంట్లో నిద్రిస్తున్న తమ అన్నపై పెట్రోల్ పోసి, నిప్పంటించి, కడతేర్చారు.. ఈ విషాద ఘటన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని కొత్తూరులో చోటుచేసుకుంది. దీంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. కొత్తూరుకు చెందిన గాలిపెల్లి బక్కయ్య-వినోద దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కూతురు పుష్పలతను సుల్తానాబాద్ మండలంలోని సుగ్లాంపల్లికి చెందిన బైరి అనిల్‌కు ఇచ్చి, వివాహం చేశారు. పెద్ద కుమారుడు అశోక్(36) ఐదేళ్లు దుబాయిలో ఉండి, పది నెలల క్రితమే స్వగ్రామం వచ్చాడు. అతని తమ్ముడు నరేశ్ జూలపల్లి మండల కేంద్రంలో బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అశోక్ దుబాయిలో ఉంటూ సంపాదించిన డబ్బులను తన తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలో జమ చేశాడు. వాటితో నరేశ్ ధర్మారం మండల కేంద్రంలో రెండు గుంటల భూమి కొనుగోలు చేసి, తన పేరిటే రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తండ్రి బక్కయ్య అనారోగ్యంతో మంచానికే పరిమితం కావడంతో ఇంటి వ్యవహారాలు చూసుకున్నాడు.

తమ్ముడికి వివాహేతర సంబంధం..

ఈ క్రమంలో కొత్తూరుకే చెందిన ఓ వివాహితతో అశోక్ తమ్ముడు నరేశ్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమెను ఇంటికి తీసుకువస్తానని దుబాయి నుంచి వచ్చిన తన అన్నతో చెప్పాడు. దీనికి అతను కుటుంబానికి చెడ్డ పేరు వస్తుందని, తనకు పెళ్లి కావాల్సి ఉందని అభ్యంతరం చెప్పాడు. నరేశ్ ప్రవర్తన నచ్చని అశోక్ తాను పంపించిన డబ్బుల లెక్క చెప్పాలని నిలదీశాడు.

డబ్బులు తిరిగి ఇవ్వాలని చెల్లి, బావపై ఒత్తిడి

అశోక్ తన బావ అనిల్‌కు కూడా అవసరం నిమిత్తం దుబాయి నుంచి డబ్బులు పంపించాడు. వాటిని తిరిగి ఇవ్వాలని చెల్లి పుష్పలత, బావపై ఒత్తిడి చేశాడు. దీంతో ఎలాగైనా అశోక్‌ను చంపాలని నరేశ్, పుష్పలత, అనిల్ నిర్ణయించుకున్నారు. 20 రోజుల క్రితం రాత్రి అతను ఇంట్లో నిద్రిస్తుండగా దాడి చేశారు. ఈ విషయమై అశోక్ ధర్మారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇది కుటుంబ వ్యవహారంగా భావించిన పోలీసులు కులపెద్దల సమక్షంలో పంచాయితీ చేసుకొని, కలిసి ఉండాలని సూచించారు.

స్నేహితుల ఇళ్లలో ఉన్నాడు..

5 రోజుల క్రితం కులపెద్దలు అశోక్, నరేశ్‌లను పిలిపించి తల్లిదండ్రులు బతికున్నంత కాలం ఆస్తుల జోలికి వెళ్లవద్దని, చెరో రూ.లక్ష వారి వద్ద నుంచి తీసుకోవాలని సూచించారు. దీనికి అన్నదమ్ములిద్దరూ అంగీకరించారు. అయితే తనకు ప్రాణహాని ఉందని అనుమానించిన అశోక్ ఇంటికి రాకుండా గ్రామంలోని స్నేహితుల ఇళ్లలో ఉన్నాడు. దీంతో బయట ఎందుకు ఉంటున్నావని ఇంటికి వెళ్లి, కలిసి ఉండాలని కుల పెద్దలు సూచించారు. దీంతో మంగళవారం రాత్రి ఇంటికి వచ్చి నిద్రించాడు. బుధవారం తెల్లవారుజామున నరేశ్, పుష్పలత, అనిల్ అతను బయటకు రాకుండా తలుపు గడియ పెట్టారు.

కిటికీలో నుంచి నిప్పంటించారు..

నిద్రలో ఉన్న అశోక్‌పై కిటికిలో నుంచి పెట్రోల్ పోసి, నిప్పంటించారు. మంటలకు అశోక్ లేచి, బయటకు వచ్చే ప్రయత్నం చేసినప్పటికీ సాధ్యం కాలేదు. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి వరుసకు అన్న అయిన కొక్కుల రాంనారాయణ ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. సంఘటన స్థలాన్ని పెద్దపల్లి ఏసీపీ మహేశ్, సీఐ అనిల్, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ పరిశీలించి, వివరాలు సేకరించారు. నరేశ్, పుష్పలత, అనిల్‌పై స్థానికులు దాడి చేసేందుకు ప్రయత్నించగా అడ్డుకొని, పోలీస్ వాహనంలో ధర్మారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

'సబ్బితం'లో మునిగి యువకుడి దుర్మరణం


వెంకటేశ్ మృతదేహాన్ని తీసుకువస్తున్న పోలీసులు


జలపాతానికి వెళ్లే దారిని మూసివేసిన పోలీసులు

- ఈత కొట్టేందుకు జలపాతంలో దిగడంతో ఘటన
- కళ్లముందే జరగడంతో కన్నీరుమున్నీరైన స్నేహితులు
- మృతుడు కరీంనగర్‌వాసి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని సబ్బితం పంచాయతీ పరిధి గౌరీగుండాల జలపాతం అందాలను చూసేందుకు స్నేహితులతో వెళ్లిన ఓ యువకుడు నీటిలో మునిగి మృతిచెందాడు. కళ్లముందే మునిగిపోయాడని అతని మిత్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కరీంనగర్ పట్టణంలోని కిసాన్‌నగర్‌కు చెందిన మానుపాటి వెంకటేశ్(24) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం తన స్నేహితులు అభిలాష్, రాకేశ్, భరత్, అఖిల్‌తో కలిసి గౌరీగుండాల జలపాతం వద్దకు వెళ్లాడు. అక్కడ అందరూ కలిసి ఫొటోలు దిగారు. తర్వాత ఈత కొట్టేందుకు నీటిలో దిగారు. కొద్దిసేపటికే నీటి ఉధృతికి వెంకటేశ్ మునిగిపోయాడు. అతని స్నేహితులు కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. వెంకటేశ్ కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఏసీపీ ఎడ్ల మహేశ్, సీఐలు అనిల్‌కుమార్, సత్యనారాయణ, ఎస్సై మహేందర్, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ తమ సిబ్బందితో జలపాతం వద్దకు వచ్చారు. రెండు గంటలపాటు శ్రమించి, వెంకటేశ్ మృతదేహాన్ని వెలికితీశారు. తన కుమారుడు డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి, బయల్దేరాడని, ఇలా జలపాతంలో శవమయ్యాడంటూ మృతుడి తండ్రి రాజేశం రోదించారు. ఈ ఘటనతో పోలీసులు పొక్లెయిన్ తెప్పించి, జలపాతం వైపు వెళ్లకుండా కందకం తవ్వించారు. సాయంత్రం జలపాతం వద్దకు వెళ్లే దారిని మూసివేశారు.


వెంకటేశ్ (ఫైల్)

ఆరేళ్లలో 15 మంది..

గౌరీగుండాల జలపాతంలో మునిగి, ఆరేళ్లలో 15 మంది చనిపోయారు. ఐదేళ్ల క్రితం ఫారెస్ట్ అధికారులు తాత్కాలికంగా రక్షణ కోసం పైభాగంలో రెయిలింగ్ ఏర్పాటు చేసినా కొద్దిరోజులకే తొలగించారు. జలపాతం వద్దకు వచ్చే పర్యాటకులు నీటిలోకి దిగకుండా దూరం నుంచే చూసేలా చుట్టూ ఇనుపకంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్ ఉద్యోగి క్వార్టర్‌లో చోరీ

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారం టౌన్‌షిప్‌లో మంగళవారం రాత్రి ఉద్యోగి షాలినీ సింగ్‌కు చెందిన క్వార్టర్ నంబర్ బీ-201లో దొంగతనం జరిగింది. స్థానికులు బాధితురాలికి ఫోన్‌లో విషయాన్ని తెలిపారు. తాను సెలవు పెట్టి, స్వస్థలానికి వెళ్లానని, 144 గ్రాముల బంగారం చోరీకి గురైందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్టీపీసీ ఎస్సై జీవన్ బుధవారం ఘటనాస్థలికి చేరుకొని, వివరాలు సేకరించారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. టౌన్‌షిప్ సెక్యూరిటీ విభాగం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే దొంగతనం జరిగిందని స్థానికులు ఆరోపించారు.

భారీ వర్షాలతో ఓసీపీల్లోకి వరద నీరు

- ఫ్లాటూన్ పంపుల ద్వారా బయటకు పంపుతున్న అధికారులు


ఓసీపీ-1లో ఏర్పాటు చేసిన ఫ్లాటూన్ పంపులు

గోదావరిఖని: భారీ వర్షాలతో ఓసీపీల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ఆర్జీ-1, 2, 3 ఏరియాల్లోని నాలుగు ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ఓబీ పనులు నిలిచిపోయాయి. రోజుకు 3.80 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత, 45 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. స్టాక్‌యార్డులో నిల్వ ఉన్న బొగ్గును వినియోగదారులకు సరఫరా చేస్తున్నారు. వరద నీటిని బయటకు పంపేందుకు నీటిలో తేలియాడే ఫ్లాటూన్ పంపులను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఎప్పటికప్పుడు క్వారీలో చేరిన నీటిని పంపింగ్ చేస్తున్నారు. జీడీకే-5 ఓసీపీ పక్కనే పెద్ద డ్రైనేజీ కాలువ, ఓసీపీ-3 పక్కన జల్లారం వాగు, ఓసీపీ-1 ప్రాజెక్టు పక్కనే బొక్కలవాగు ఉండటంతో అధికారులు వరద ఉధృతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

స్వల్ప దూర ప్రయాణానికి టీ9-30 టికెట్

గోదావరిఖనిటౌన్: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రయాణికుల స్వల్ప దూర ప్రయాణం కోసం ఆర్టీసీ కొత్తగా టీ9-30 టికెట్‌ను అందుబాటులోకి తెచ్చిందని గోదావరిఖని డిపో మేనేజర్ ఎం.నాగభూషణం తెలిపారు. పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణికులు రూ.50 చెల్లిస్తే 30కిలోమీటర్ల పరిధిలో రానుపోను వెసులుబాటు ఉందని, ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ఈ టికెట్ చెల్లుబాటు అవుతుందన్నారు. 30 కిలోమీటర్ల పరిధిలో ఇతర రాష్ట్రాల ప్రయాణానికీ ఇది వర్తిస్తుందని అన్నారు. రూ.20 కాంబినేషన్ టికెట్‌తో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కూడా ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. బస్‌లలో కండక్టర్లు సాయంత్రం 6గంటలలోపు మాత్రమే ఈ టికెట్ ఇస్తారని పేర్కొన్నారు. వివరాలకు 040-69440000, 040-23450033 నంబర్‌లలో సంప్రదించాలని తెలిపారు.

ఆర్థిక వృద్ధికే రుణాలు


వసంతకు కారు తాళాలు అందిస్తున్న మేనేజర్

పెద్దపల్లిరూరల్: అర్హుల ఆర్థికాభ్యున్నతికి ప్రభుత్వం రాయితీపై రుణాలిస్తోందని ఎస్‌బీఐ అగ్రికల్చర్ కమర్షియల్ బ్యాంక్ మేనేజర్ గోపాలకృష్ణమూర్తి అన్నారు. పెద్దపల్లిలో బ్యాంకు నుంచి కేంద్రప్రభుత్వం దళిత, గిరిజన మహిళలకు ఆర్థికంగా చేయూతనందించేందుకు అమలు చేస్తున్న స్టాండప్ ఇండియా పథకం కింద రూ.15.97లక్షలు మంజూరైన నిధులతో కొనుగోలు చేసిన వాహనాన్ని లబ్ధిదారు కల్వల వసంతకు అందించారు. తమ బ్యాంకు ద్వార రైతుల పంటరుణాలు, మహిళాసంఘాలకు రుణాలందిస్తున్నామన్నారు. రుణాలు పొందిన వారంతా తిరిగి సకాలంలో చెల్లించాలని కోరారు.

యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే గని ప్రమాదం




సారయ్య మృతదేహానికి నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ మధు, పరిశీలిస్తున్న కార్మిక సంఘాల నాయకులు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రాజ్‌ఠాగూర్

- సింగరేణి కార్మిక సంఘాల నాయకుల ఆరోపణ
- మృతి చెందిన కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్

గోదావరిఖని: సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే కార్మికుడు మృతిచెందాడని కార్మిక సంఘాల నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, తుమ్మల రాజారెడ్డి, జనక్‌ప్రసాద్, యాదగిరి సత్తయ్య ఆరోపించారు. బుధవారం సింగరేణి ఏరియా ఆస్పత్రి మార్చురీలో ఉన్న కార్మికుడు బూర్ల సారయ్య మృతదేహానికి నివాళి అర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం మాట్లాడుతూ.. గాయపడిన కార్మికుడికి ప్రథమ చికిత్స చేసేందుకు గని వద్ద ఎలాంటి సదుపాయాలు లేవన్నారు. పని స్థలం నుంచి పైకి తీసుకువచ్చేందుకు రెండు, మూడు గంటల సమయం పట్టడంతో మార్గమధ్యలోనే చనిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్ బ్రిడ్జి పైనుంచి నీటి ప్రవాహం వల్ల అంబులెన్స్ గని వద్దకు వెళ్లలేకపోయిందని తెలిపారు. ఏటా రూ.వేల కోట్ల లాభాలను ఆర్జిస్తున్న సింగరేణి సంస్థ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడంతో విఫలమవుతోందని మండిపడ్డారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి పరిహారం త్వరగా వచ్చేలా కృషి చేస్తామని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు చెప్పినట్లు నాయకులు పేర్కొన్నారు.

సాంకేతిక సమస్యలున్నట్లు ముందే తెలుసా?

జంబో డ్రిల్ యంత్రంలో సమస్యలున్నాయని ముందే తెలుసా? అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకోలేదా? జంబో డ్రిల్ యంత్రం ట్రాక్షన్ గేర్ పనిచేయక, బూస్టర్ గేర్ వాడటం వల్లే పైపుల్లో ప్రెజర్ పెరిగి, ప్రమాదం జరిగిందా? అన్న అనుమానాలను వ్యక్తమవుతున్నాయి. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో 86వ లెవల్ పనులు నిర్వహిస్తున్న జంబో డ్రిల్ యంత్రాన్ని మరోచోటుకు తరలిస్తున్న క్రమంలో ప్రమాదం జరిగినట్లుగా కార్మికులు చెబుతున్నారు.

ట్రాక్షన్ గేర్ పని చేయకపోవడం వల్లే..

ఏఎల్‌పీ గనిలో మూడు రోజులుగా జంబో డ్రిల్ యంత్రానికి ట్రాక్షన్ గేర్ పని చేయడం లేదని, మూమెంట్ కోసం బూస్టర్ గేర్ వాడినట్లు సమాచారం. దీనివల్ల హైడ్రాలిక్ పైపుల్లోకి ఒకేసారి పెద్ద ఎత్తున ఆయిల్ ప్రెజర్ వెళ్తుందని కార్మికులు అంటున్నారు. హైడ్రాలిక్ హోస్‌పైపు జాయింట్ వద్ద స్టెపిల్ పిన్ ఊడి, అక్కడే ఉన్న సారయ్యకు చాతిభాగంలో బలంగా తాకిందని పేర్కొంటున్నారు. సారయ్యను గనిపైకి తరలించడంలో జాప్యం జరిగినట్లు ఆరోపిస్తున్నారు. ఆయనకు వెంటనే ఆక్సిజన్ అందడంతోపాటు పైకి తొందరగా తరలించి చికిత్స అందిస్తే బతికేవాడని తెలిపారు. ఈ ఘటనపై శాఖాపరమైన విచారణకు అధికారులు ఆదేశించారు.

రూ.5 కోట్ల పరిహారం ఇవ్వాలి

సింగరేణి కార్మికుడు సారయ్య కుటుంబానికి సంస్థ యాజమాన్యం రూ.5 కోట్ల పరిహారం ఇవ్వాలని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ డిమాండ్ చేశారు. బుధవారం సింగరేణి ఏరియా ఆస్పత్రిలో సారయ్య మృతదేహానికి నివాళి అర్పించారు. సింగరేణి యాజమాన్యానికి బొగ్గు ఉత్పత్తి మీద ఉన్న శ్రద్ధ రక్షణపై లేదని ఆరోపించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు రవికుమార్, ముస్తఫా, పెద్దెల్లి ప్రకాశ్ తదితరులన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

బీఆర్ఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, కందుల సంధ్యారాణి, కౌంకటి లక్ష్మీనారాయణ, పాతిపెల్లి ఎల్లయ్య, బయ్యపు మనోహర్‌రెడ్డి సింగరేణి కార్మికుడు సారయ్య మృతదేహానికి నివాళి అర్పించారు. మృతుడి కుటుంబాన్ని యాజమాన్యం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సేఫ్టీ అధికారిని సస్పెండ్ చేయాలి

రక్షణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గని సేఫ్టీ అధికారిని సస్పెండ్ చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఏరియా ఆస్పత్రిలో సారయ్య మృతదేహాన్ని పరిశీలించారు.

జెడ్పీ చైర్మన్ నివాళి

కమాన్‌పూర్: సింగరేణి కార్మికుడు సారయ్య మృతదేహానికి సెంటినరీకాలనీలోని ఆయన క్వార్టర్ వద్ద జెడ్పీ చైర్మన్ పుట్ట మధు నివాళి అర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చారు. చైర్మన్ వెంట టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకేసి రవీందర్ తదితరులు ఉన్నారు.

సింగరేణి ఐరన్ పైపుల పట్టివేత


ఐరన్ పైపులతో సెక్యూరిటీ సిబ్బంది

గోదావరిఖని: సింగరేణి రామగుండం డివిజన్-1 పరిధిలోని ఫిల్టర్ బెడ్ సమీపం నుంచి ఎత్తుకెళ్లి, ఓ ఇంట్లో దాచిన ఐరన్ పైపులను సెక్యూరిటీ సిబ్బంది బుధవారం పట్టుకున్నారు. గోదావరిఖని గంగానగర్ ఫిల్టర్ బెడ్ నుంచి దొంగలు పైపులను ఎత్తుకెళ్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఉమేశ్ అప్రమత్తమయ్యారు. తమ బృందాలతో ఆకస్మిక దాడి చేయడంతో దొంగలు పైపులను అక్కడే పడేసి, పరారయ్యారు. సిబ్బంది వాటిని జీఎం కార్యాలయానికి తరలించారు. ఎంటీఎఫ్, ఏసీటీఎఫ్ బృందాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా సెక్యూరిటీ సిబ్బందిని ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి అభినందించారు.

లారీని ఢీకొన్న ద్విచక్రవాహనం

- ఇద్దరికి గాయాలు


బాధితులను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు


సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి శివారులో రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మండలంలోని రేగడిమద్దికుంటకు చెందిన కుర్ర రాము, ఎలిగేడు మండలంలోని నర్సాపూర్‌కు చెందిన యాదగిరి రాజు వ్యాన్ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. బుధవారం ద్విచక్రవాహనంపై కరీంనగర్ వెళ్తూ కాట్నపల్లి వద్ద లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు బాధితులను ఆస్పత్రికి తరలించి, వారి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఏఎల్పీ గనిని సందర్శించిన డైరెక్టర్

గోదావరిఖని: సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్ బుధవారం ఏఎల్పీ గనిని సందర్శించారు. గనిలోని ప్రమాద స్థలానికి వెళ్లి ప్రమాదానికి దారి తీసిన పరిస్థితిని తెలుసుకున్నారు. డిప్యూటీ డైరెక్టర్ మైన్స్ సేఫ్టీ బానోతు వెంకన్న గనిలోకి దిగి ప్రమాదంపై విచారణ చేపట్టారు.

వరదలో చిక్కుకొని ఎడ్లు మృతి

- ప్రాణాలతో బయటపడిన రైతు


వాగు ప్రవాహంలో మృతిచెందిన ఎడ్లు

కాల్వశ్రీరాంపూర్: ఓ రైతు ఎడ్లబండిపై పొలానికి వెళ్లి, తిరిగి వస్తుండగా వరద ప్రవాహంలో చిక్కుకొని, ఎడ్లు మృతిచెందాయి. రైతు ప్రాణాలతో బయటపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని మల్యాలకు చెందిన మామిడి కొమురయ్య బుధవారం ఉదయం ఎడ్ల బండిపై సమీపంలోని నక్కలవాగు దాటి, తన పొలానికి వెళ్లాడు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో వాగు దాటుతుండగా వరద ఉధృతికి ఎడ్లబండితో సహా కొట్టుకుపోయాడు. మెల్లిగా ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నాడు. కానీ బండికి కట్టి ఉన్న ఎడ్లు తప్పించుకోలేక వరద ప్రవాహంలో చిక్కుకొని, మృతిచెందాయి. కళ్లముందే తన ఎడ్లు చనిపోవడాన్ని చూసి కొమురయ్య గుండెలు బాదుకున్నాడు. పొరుగున ఉన్న రైతులు ఆయనకు ధైర్యం చెప్పి, గ్రామస్తులకు సమాచారం చేరవేశారు. సర్పంచు లంక రాజేశ్వరి భర్త సదయ్య సంఘటన స్థలానికి చేరుకొని, ఈతగాళ్లతో చనిపోయిన ఎడ్లను బయటకు తీయించారు. ఆ జీవాల విలువ రూ. లక్ష ఉంటుందని బాధితుడు రోదించాడు.

కమిషనరేట్‌లో 11 మంది ఎస్సైల బదిలీ

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో 11 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ కమిషనర్ రెమా రాజేశ్వరి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్సై పేరు	ప్రస్తుతం	బదిలీ
ఎన్.శ్రీధర్	సీసీఎస్	పొత్కపల్లి
వి.ప్రవీణ్‌కుమార్	సీఎస్‌బీ	బెల్లంపల్లి, వన్‌టౌన్
టి.విక్టర్	బెల్లంపల్లి, వన్‌టౌన్	వీఆర్, రామగుండం
జి.అనూష	వీఆర్	ట్రాఫిక్, రామగుండం
టి.ఉదయ్‌కిరణ్	సీసీఆర్‌బీ	ట్రాఫిక్, రామగుండం
కిరణ్‌కుమార్	సీఎస్‌బీ	మంథని
మధుసూదన్‌రావు	మంథని	ముత్తారం
బి.శరణ్య	ఎస్‌హెచ్‌వో, రామగుండం	జీడీకే, వన్‌టౌన్
బి.వెంకటస్వామి	జీడీకే, వన్‌టౌన్	ఎస్‌హెచ్‌వో, రామగుండం
జక్కుల రవళి	బెజ్జూర్	వీఆర్, రామగుండం
గట్ల సుధాకర్	సీసీఎస్, మంచిర్యాల్	టేకుమట్ల, భూపాల్‌పల్లి

ప్రభుత్వ ఒత్తిడితోనే గుర్తింపు ఎన్నికలు వాయిదా

గోదావరిఖని: రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడితోనే సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడం లేదని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. బుధవారం జీడీకే-1 గనిపై గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఎన్నికలు నిర్వహిస్తే వేరే యూనియన్ గెలుస్తుందని, సింగరేణి నుంచి నిధులు రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్లకుండా అడ్డుకుంటుందనే ఆలోచనతో అడ్డుకుంటోందన్నారు. సంస్థకు రావాల్సిన రూ.30వేల కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ కేంద్ర 16వ మహాసభలు ఆగస్టు 25 నుంచి 27 వరకు గోదావరిఖనిలో నిర్వహిస్తున్నామని, మహాసభలను జయప్రదం చేయాలని కార్మికులను కోరారు. సమావేశంలో నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, రంగు శ్రీనివాస్, సంకె అశోక్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎంపీటీసీ మాజీ సభ్యుడి మృతి


వెంకటేశ్ (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్ల ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎనగందుల వెంకటేశ్ (40) గుండెపోటుతో మృతిచెందారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. ఆరెపల్లె పంచాయతీ పరిధి మల్లయ్యపల్లెకు చెందిన వెంకటేశ్ పందిల్ల ఎంపీటీసీ అభ్యర్థిగా బీజేపీ నుంచి గెలిచారు. తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంగళవారం రాత్రి గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. మృతుడికి భార్య భారతి, కుమారుడు, కూతురు ఉన్నారు. వెంకటేశ్ అంత్యక్రియలను మల్లయ్యపల్లెలో నిర్వహించగా గ్రామస్తులు తరలివచ్చారు.